

ప్రభుత్వ బడికి బాటలు
బడిబాటలో భాగంగా కొందరు ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి విద్యార్థులను తీసుకొచ్చి బడుల్లో చేర్పిస్తున్నారు.

- 8లో



రూ.3వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం
జిల్లా కేంద్ర సహకార బ్యాంకును రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్లడమే లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో

గరిష్టం / కనిష్టం
30°/ 24°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ
నల్లగొండ రూరల్: ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఎస్సీ నిరుద్యోగులకు పలు కోర్సులపై ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మెడికల్ కోర్సులైన జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో భోజన వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ పటణంలోని హైదరాబాద్ రోడ్డు మర్రిగూడెం ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఉన్న కార్యాలయంలో ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 90599 02355, 98485 81100 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోర్ట్‌పోలియో జడ్జిని కలిసిన న్యాయమూర్తులు



పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ సాంబశివరావుతో జిల్లా కోర్టు జడ్జీలు, న్యాయవాదులు

చివ్వెంల: విజయవాడకు వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట పరిధిలోని సెవన్ ఆర్ హోటల్‌లో అల్పాహారం కోసం ఆగిన సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ యు.సాంబశివరావును శుక్రవారం జిల్లా కోర్టు న్యాయమూర్తులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ, జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, కోశాధికారి ధరావత్ వీరేష్ నాయక్, లైబ్రరీ సెక్రటరీ ఎండీ.అబ్దుల్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన చేయాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఈఓ అశోక్

నాగారం: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని డీఈఓ అశోక్ అన్నారు. శుక్రవారం నాగారంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల్లో విరివిరిగా మొక్కలు నాటాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం రాందాస్‌నాయక్, ఉపాధ్యాయులు వీరేష్, భాస్కర్, రవీనా ఉన్నారు.

మేమింతే.. మేం మారం!

- జిల్లాలో పెరుగుతున్న లంచావతారులు
- వరుసగా ఏసీబీకి చిక్కుతున్న అధికారులు
- గత నెలలో ఒకరు.. తాజాగా మత్స్యశాఖ ఆఫీసర్
- ఏ చిన్న పనిచేయాలన్నా లంచం డిమాండ్
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

సూర్యాపేట, భానుపురి: పని ఏదైనా.. ప్రభుత్వ నిబంధనలు ఎలా ఉన్నా.. జిల్లాలో కొందరు అధికారులు లంచం తీసుకోనిదే పనిచేయని పరిస్థితి నెలకొంది. ఏ పని అవ్వాలన్నా.. ఫైల్ కదలన్నా ప్రభుత్వానికి కట్టే ట్యాక్స్‌తోపాటు అధికారుల చేయి తడిపితేనే లెక్క. లేదంటే ఆ ఫైళ్లు పెండింగ్‌లో ఉండాల్సిందే. జిల్లాలో వరుసగా ఏసీబీ అధికారులు దాడులు చేసి అక్రమార్కులను పట్టుకుంటున్నా ఏ మాత్రం భయం లేకుండా ప్రజల నుంచి లంచం డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఇద్దరు అధికారులు ఇటీవల కాలంలో ఏసీబీ అధికారులకు పట్టుబడగా.. ఒకరు మూడోసారి, మరొకరు రెండోసారి కావడం గమనార్హం. అలాగే కొన్ని ప్రధాన శాఖల్లోని అధికారులకు లంచం ఇవ్వనిదే పనులు చేయట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తాజాగా ఏసీబీకి చిక్కిన మత్స్యశాఖ అధికారి

సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్ రూ.25వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు సారగండ్ల



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్



లంచం తీసుకుంటూ పట్టుబడిన సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్

కోటయ్య, కోశాధికారి ఇండ్ల సురేష్ తమ పరిధిలోని చెరువులో చేపలు పట్టుకునేందుకు కావాల్సిన అనుమతి పత్రాన్ని కోరారు. ఇందుకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును నిబంధనల మేరకు చెల్లించినప్పటికీ అనుమతులు ఇవ్వకుండా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్ డబ్బులను డిమాండ్ చేయడంతో సొసైటీ సభ్యులు ఏసీబీ అధికారులను సంప్రదించారని తెలిపారు. శుక్రవారం ఉదయం ఎస్పీ కార్యాలయానికి సమీపంలోని అద్దె భవనంలో సొసైటీ సభ్యుల నుంచి రూపేందర్‌సింగ్ రూ.25వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. 2022 నుంచి సూర్యాపేటలో పనిచేస్తున్న రూపేందర్‌సింగ్ 2016లో నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు కూడా ఏసీబీకి చిక్కినట్లు తెలిసిందన్నారు.

రూపేందర్‌సింగ్ రూటే సప‘రేటు’..

ఏసీబీ అధికారులకు చిక్కిన జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్ రూటే సప్షరేటు‘‘గా ఉంటుంది. ఈయన పని అయ్యే దానికి తప్ప.. ఇతరులకు అందుబాటులో ఉండడు. ఫోన్ చేసిన ఎత్తడని ఓ వైపు అధికారులు.. మరోవైపు మత్స్యకారులే అంటున్నారు. కార్యాలయంలోని ఓ ఉద్యోగితో పాటు మత్స్య సొసైటీలో కీలక పదవిలో ఉన్న మరోవ్యక్తి సహకారంతో తన అవినీతి దందాను కొనసాగించినట్లు తెలుస్తోంది. వందలాది మందికి రూ.5వేల నుంచి రూ.20వేల వరకు (సొసైటీ ప్రాంతాన్ని బట్టి) లంచం తీసుకుని సభ్యత్వాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. చెరువుల్లో చేపలు పట్టుకోవాలన్నా.. సభ్యత్వాల రెన్యూవల్‌కూ ముడుపులు తీసుకునే వాడన్న అపవాదు ఉంది. గతంలో చేపపిల్లల టెండర్లను జాప్యం చేసి అప్పటి ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు మేలు జరిగేలా చూశారని, ఇందుకు ముడుపులు పుచ్చుకున్నట్లు తెలుస్తోంది. నాణ్యతలేని చేపపిల్లలను చెరువుల్లో వదులుతున్నా కాంట్రాక్టర్లకు వత్తాసు పలికినట్లు గతంలో విమర్శలు వచ్చాయి. ఏనాడూ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అందుబాటులో ఉండేవారు కాదని, సెటిల్‌మెంట్ల కోసం పాత కార్యాలయంలోనే ఉండేవారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెండు నెలల్లో ఇద్దరు!
అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులను ఇటీవల కాలంలో ఏసీబీ అధికారులు పట్టుకుంటున్నారు. జిల్లాలో గతనెల 3న సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్.. ఓ వ్యక్తి వద్ద అన్నిపత్రాలున్నా భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా రూ.లక్ష డిమాండ్ చేసి రూ.99,200లను డాక్యుమెంట్ రైటర్ల ద్వారా తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఇతను డాక్యుమెంట్ల రైటర్లను మధ్యవర్తులుగా పెట్టుకుని రోజుకు రూ.2, 3 లక్షలు వసూలు చేయనిదే ఇంటికి వెళ్లేవాడు కాదని ప్రచారం జరుగుతోంది. ఇక తాజాగా శుక్రవారం రూ.25వేల లంచం తీసుకుంటూ జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్ ఏసీబీకి చిక్కాడు. రెండు నెలల్లో ఇద్దరు అధికారులు ఏసీబీకి పట్టుబడడం జిల్లాలో చర్చనీయాంశమైంది. వీరే కాకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, సివిల్ సప్లయ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్య, వైద్యం.. ఇలా అన్ని శాఖల్లోనూ కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు సిబ్బంది ఇదేబాటలో నడుస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

గంజాయి నిర్మూలనకు కృషిచేద్దాం

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: గంజాయి నిర్మూలనకు కలిసికట్టుగా కృషిచేద్దామని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు గంజాయి ఎక్కువ మొత్తంలో సీజ్ చేశామని, గంజాయి రవాణా చేసే, సేవించే, అమ్మేవారిపై కేసులు నమోదు చేశామన్నారు. అలవాటుగా అదే నేరానికి పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. ప్రతినెలా మూడో బుధవారం యాంటీ డ్రగ్స్ డేగా ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పౌరులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. అనంతరం కేసుల నమోదు, పెండింగ్ కేసుల రికార్డ్స్ పరిశీలించారు. కొత్త న్యాయ చట్టాలపై నైపుణ్యం సాధించాలని, కేసుల నమోదులో అవసరమైతే సీఐడి ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సహాయం తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదవాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారి- 65 వెంట ఉన్న గ్రామాల ప్రజల్లో రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్దన్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్, డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, మట్టయ్య, శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు
భానుపురి (సూర్యాపేట): గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు పంచాయతీ కార్యదర్శులు, పర్యవేక్షణ చేయని ముగ్గురు ఎంపీఓలకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశానుసారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మునగాల, మఠంపల్లి, నడిగూడెం ఎంపీఓలు భూపాల్ రెడ్డి, ఆంజనేయులు, దుర్గాప్రసాద్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. అలాగే హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామ కార్యదర్శి గిరిజకుమారి, శ్రీనివాసపురం కార్యదర్శి శేఖర్, మునగాల మండలం తాడ్వాయి గ్రామ కార్యదర్శి సతీష్, నడిగూడెం మండలం తెల్లబెల్లి కార్యదర్శి విజయకుమారిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

విధులకు గైర్హాజరైనందుకు..

ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన మునగాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్‌కు కూడా కలెక్టర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మెడికల్ ఆఫీసర్, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, చట్ట విరుద్ధ అబార్షన్ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ కోటిరత్నం, డాక్టర్ నాజియా, మీడియా అధికారి అంజయ్య గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో ప్రజాపాలన అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

అధికారులు పారదర్శకంగా పనిచేయాలి

హుజూర్‌నగర్ రూరల్: అధికారులు పారదర్శకంగా పనిచేస్తూ.. సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, పురపాలక శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఆగస్టు నెలాఖరు వరకు హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఎస్ఎస్‌పీ కెనాల్ లైనింగ్, కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. ఆర్డీఓ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ఈ నర్సింహారావు, డీఈలు భిక్షం, రవికాంత్, రఘుస్వామి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిబాబు, డీపీఓ శివ, మేనేజర్ యాకుబ్ పాషా పాల్గొన్నారు.

38,600 మందికి వర్తించని రుణమాఫీ

- డీసీసీబీలో 72,513 మందిలో 33,913 మందికే మాఫీ
- మిగతా వారికి వారంలో మాఫీ అవుతాయంటున్న సహకార బ్యాంకు వర్గాలు

సాక్షి ప్రతినిధి నల్లగొండ : ఉమ్మడి జిల్లాలోని 111 పీఏసీఎస్‌లలో సభ్యులుగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నుంచి రుణాలు తీసుకున్న రైతుల్లో అందరికీ రూ.లక్షలోపు రుణమాఫీ కాలేదు. శుక్రవారం నాటికి డీసీసీబీ నుంచి అందిన సమాచారం ప్రకారం రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారిలో సగం మంది రుణాలే మాఫీ అయ్యాయి. ఆ జాబితా మాత్రమే డీసీసీబీకి అందినట్లు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారు 72,513 మంది ఉండగా, వారికి బ్యాంకు రూ.316, 55,69,000 రుణాలు ఇచ్చింది. ఆ వివరాలను ప్రభుత్వానికి పంపించింది. అయితే అందులో 33, 913 మందికి సంబంధించిన రూ. 143,10,99,568 మాత్రమే ఈరోజు వరకు మాఫీ అయినట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. మ్యానువల్‌గా చేయాల్సి ఉన్నందున మిగతా వారి పేర్లు రుణమాఫీ అయిన వారి జాబితాలో రాలేదని, పది రోజుల్లోగా వారి రుణాలు కూడా మాఫీ అవుతాయని ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చినట్లు డీసీసీబీ వర్గాలు వెల్లడించాయి. ఇక కొన్ని కమర్షియల్ బ్యాంకులకు సంబంధించిన రుణాలు మాఫీ కాలేదని రైతులు ఇప్పటికే బ్యాంకుల వద్దకు వెళ్తుండగా, డీసీసీబీ పరిధిలోనూ అత్యధిక మంది రుణాలు మాఫీ కాకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. తమకు ఎందుకు మాఫీ కాలేదో అర్థం కాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో రైతులకు రుణమాఫీ కాలేదు. ఇలా నల్లగొండ జిల్లాలో కమర్షియల్ బ్యాంకులతో పాటు డీసీసీబీలో రుణాలు తీసుకున్న 50వేల మంది వరకు రుణాలు మాఫీకాని వారు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే వివిధ కారణాలు, సాంకేతిక సమస్యలు కారణంగానే వారికి కాలేదని, ఆలస్యం అవుతోందని, వారందరి రుణాలు పది రోజుల్లో మాఫీ అవుతాయని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రుణమాఫీ కాని వారు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేస్తే.. పరిశీలించి రుణమాఫీ అయ్యేలా చర్యలు చేపడతామని వివరిస్తున్నారు.

ఆదాయ పన్ను చెల్లింపుపై అవగాహన అవసరం

సూర్యాపేట: ఆదాయ పన్ను చెల్లింపుపై ప్రతిఒక్కరికీ పూర్తి అవగాహన అవసరమని ఆదాయ పన్ను శాఖ జిల్లా అధికారి జీవీఆర్ ప్రకాష్ శర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీటీఓ రవికుమార్ అధ్యక్షతన ఆదాయ పన్ను చెల్లింపుదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆదాయపు పన్ను శాఖ చెల్లింపుదారులు దాఖలు చేసిన రిటర్న్‌ల కచ్చితత్వాన్ని కూడా పర్యవేక్షిస్తుందన్నారు. ఈ నెల 31 వరకు ఆదాయపు పన్నులను దాఖలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ బాబురావు, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్, చార్టెడ్ అకౌంటెంట్‌లు, డీడీఓలు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవీఆర్ ప్రకాష్ శర్మ

దోమలు, కుక్కల బెడదను నివారించాలి

- ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు తొలగించాలి
- డ్రైయినేజీల్లో పూడిక తీయించాలి
- దోమల మందు పిచికారీ చేయించాలి

‘సాక్షి’ ఫోన్ ఇన్‌లో హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌కు ప్రజల విన్నపం

హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని పలు వీధుల్లో డ్రైయినేజీల్లో పూడిక పేరుకుపోయిందని, ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి దోమల బెడద ఎక్కువైందని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, డ్రైయినేజీలు, రోడ్ల సమస్యలపై శుక్రవారం ‘సాక్షి’ ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. దోమలు, కుక్కల బెడదను నివారించాలని ప్రజలు వేడుకున్నారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి సావధానంగా విన్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలు విన్నవించిన సమస్యలు.. కమిషనర్ సమాధానాలు ఇలా ఉన్నాయి

– హుజూర్‌నగర్



ఫోన్‌లో ప్రజల సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

ప్రశ్న : 13, 14 వార్డుల్లో దోమలు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. బావుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయించాలి.

– దేవరం మల్లీశ్వరి, రెడ్డిబజార్, ఇందిరాల నర్సయ్య

కమిషనర్ : త్వరలోనే కుక్కల బెడద నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్నాం. బావుల్లోనూ వేయిస్తాం.

ప్రశ్న : అడ్డమీద కూలీలు మెయిన్ రోడ్డు మీద నిలబడట వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. వారికి వేరే ప్రాంతంలో అడ్డా ఏర్పాటు చేయాలి. ?

–జక్కుల వీరయ్య, కౌన్సిలర్

కమిషనర్: ఈ సమస్యను మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న : రోడ్లపై పశువులు నిలువకుండా చేయాలి. ప్రభుత్వం లేఅవుట్ స్థలాల చుట్టూ పెన్సింగ్ వేయించాలి.

–కంటు నాగరాజు

కమిషనర్ : ఇప్పటికే పశువుల యజమానులకు మీడియా ద్వారా నోటీసులు అందించాం. నోటీసులకు స్పందించకుంటే ఎటువంటి సమాచారం లేకుండా గోశాలకు తరలిస్తాం. ఇప్పటికే కొన్ని ప్లాట్లకు పెన్సింగ్ వేయించాం, మిగిలిన వాటికి కూడా వేయిస్తాం.

ప్రశ్న : ఏపీఎస్ అపార్ట్‌మెంట్ ఎదురుగా నిల్వ ఉండి దుర్వాసన వస్తున్న నీటి తొలగించాలి. అలాగే అపార్ట్‌మెంట్ ఎదుట పిచ్చిమొక్కలను తొలగించాలి

–శ్రీకాంత్‌రెడ్డి, రమణారెడ్డి

కమిషనర్ : ఓపెన్ ప్లాట్ల వారికి నోటీసులు ఇచ్చి నీరు నిలవకుండా చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం. ప్లాట్లలో పిచ్చిమొక్కలను తొలగింపజేస్తాం

ప్రశ్న : మఠంపల్లి రోడ్డులోని గల్లీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. అలాగే సీసీ రోడ్ల వెంట కంపచెట్లు తొలగించి మట్టిపోయాలి

–వికాస్, రెడ్డి బజార్, చెన్నగాని నర్సింహారావు

కమిషనర్ : చిత్తడి రోడ్లపై ప్రస్తుతం గ్రావెల్ రోడ్డు వేయిస్తాం. దశల వారీగా సీసీ రోడ్డు పోయిస్తాం. కంపచెట్లను తొలగించి మట్టిపోసి చదును చేయిస్తాం

ప్రశ్న : స్వరాజ్ షోరూం పక్కన బజార్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలి.

–షేక్ మహ్మద్

కమిషనర్ : మున్సిపల్ పాలక మండలి నిర్ణయం మేరకు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఫైర్ స్టేషన్ వద్ద డ్రైయినేజీలో పూడిక తీయించాలి. రోడ్డుపై బురదగా ఉన్నందున మట్టి పోయించాలి.

– నరేందర్‌నాయుడు

కమిషనర్ : డ్రైయినేజీలో పూడిక తీయిస్తాం. రోడ్డుపై బురద కాకుండా ఉండేందుకు గావెల్ పోయించి చదును చేయిస్తాం.

ప్రశ్న : లేఅవుట్‌లు లేకుండా ప్లాట్లు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. 9వ వార్డులోని వాగులో నీరు పారేలా చర్యలు తీసుకోవాలి.

–జడ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్

కమిషనర్ : లేఅవుట్‌లను పరిశీలించి అక్రమమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వాగులో నీరు పారేలా ఏర్పాట్లుటు చేస్తాం.

ప్రశ్న : పట్టణంలోని మెయిన్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసి ఆర్టీసీ బస్సులు పాత బస్టాండ్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

–శ్రీనివాసాచారి

కమిషనర్ : సాధ్యమైనంత త్వరలోనే రోడ్డు పనులు పూర్తిచేస్తాం. పాత బస్టాండ్‌కు బస్సులు నడిపేలా చూస్తాం.

ప్రశ్న : ఆర్‌డీఓ ఆఫీస్ పక్కన సాముల శివారెడ్డి బజార్‌లో, ఎన్‌జీఓ కాలనీ, గడ్డిరెడ్డి ఫంక్షన్ హాల్‌కు వెళ్లే బజార్‌లో ఎగుడు దిగుడుగా ఉన్న రోడ్లను సరిచేయించాలి.

–వెంకటేశ్వర్లు, సాయిబాబ గుడి ఏరియా, త్రివేణి

కమిషనర్ : ఆ రోడ్డును పరిశీలించి తగిన మరమ్మతులు చేయిస్తాం.

ప్రశ్న : 28వ వార్డులోని మాధవరాయినిగూడెంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– వెంకన్న

కమిషనర్ : వెంటనే వీధిలైట్లు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : టీచర్స్ కాలనీ, పూసల ఫంక్షన్ హాల్ ఏరియాలో సీసీ రోడ్డు నిర్మించాలి.

–రమేష్

కమిషనర్ : ఈ సమస్యను కౌన్సిల్ సమావేశంలో చర్చించి సీసీ రోడ్డు నిర్మిస్తాం.

ప్రశ్న : గడ్డిరెడ్డి పంక్షన్ హాల్‌కు వెళ్లే ఎన్నెస్పీ కాలువపై నూతన బిడ్జి నిర్మించాలి.

– రంగయ్య

కమిషనర్ : నూతన బిడ్జి నిర్మాణ విషయాన్ని మున్సిపల్ పాలక మండలి సమావేశంలో చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : 14వ వార్డులో పూలరంగడు ఇంటి బజార్‌లో కల్వర్టు నిర్మించాలి. వీధిలైట్లు ఏర్పాటు చేసి, బ్లీచింగ్ చల్లించాలి.

–రామకృష్ణ

కమిషనర్ : కల్వర్టు నిర్మాణంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తాం, బ్లీచింగ్ చల్లిస్తాం.

క్లుప్తంగా

మట్టపల్లి ఆలయంలో పాండిచ్చేరి హోంమంత్రి



నమశ్శివాయం దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని పాండిచ్చేరి రాష్ట్ర హోంశాఖ మంత్రి నమశ్శివాయం సతీసమేతంగా శుక్రవారం సందర్శించారు. వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం వారు గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోనే తిరునక్షత్ర పూజలు చేస్తున్న చెన్నైకి చెందిన శ్రీ ముక్కూరు నరసింహాచార్యర్ శ్రీస్వాతీ నక్షత్రం పీఠం వద్ద కూడా పూజలు చేశారు. అనంతరం వారిని ముఖమండపంలో ,ధర్మకర్తలు, అర్చకులు సత్కరించారు. వారి వెంట ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, తహసీల్దార్ మంగ, సీఐ గజ్జి చరమందరాజు, ఎస్‌ఐ రామాంజనేయులు, అర్చకులు ఉన్నారు.

ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి



నరసింహ (ఫైల్)

నార్కట్‌పల్లి: పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి చెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెపహాడ్ గ్రామానికి చెందిన మట్టిపల్లి నరసింహ(50) శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడి అతడు బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నర్ర అంతిరెడ్డి తెలిపారు.

పిల్లలమర్రిలో అఘోరాలు



శివాలయంలో కాశీ అఘోరాలు

సూర్యాపేట రూరల్: పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో గల పురాతనమైన శివాలయాలను కాశీ అఘోరాలు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా శివాలయాల్లో అఘోరాలు ప్రత్యేక పూజలు చేశారు.

గొర్రెల అపహరణ

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని రామాజీపేటలో దుండగులు గొర్రెలను అపహరించారు. రామాజీపేటకు చెందిన గుర్రం అంజనేయులు రోజుమాదిరిగానే గురువారం తన గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం తన ఇంటి సమీపంలోని పాకలోకి తోలాడు. శుక్రవారం ఉదయం గమనించగా.. గొర్రెల మందలోని 6 గొర్రెలు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు తన గొర్రెలను అపహరించారని గ్రహించి యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన గొర్రెల విలువ రూ.80వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

ప్రభుత్వ బడికి బాటలు..

రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు ఉపాధ్యాయులు. ప్రభుత్వం చేపట్టిన బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సర్కారు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచారు.

సర్కారు పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చిన ఉపాధ్యాయులు

సొంతంగా జీతాలు చెల్లిస్తూ..

డిండి: తాను చదివిన ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుడిగా వచ్చి ఆ పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దాడు ఆయ మాస్టారు. బడికి దూరంగా ఉన్న ఎంతో మంది విద్యార్థులను బడిలో చేర్పించాడు. బడిఈడు పిల్లలు బయట ఉండకూడదంటూ ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడికి రప్పిస్తున్నారు డిండి మండలం తవక్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దెంది రాజేందర్‌రెడ్డి. కొన్ని సంవత్సరాల నుంచి ఇదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రాజేందర్‌రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో తానొక్కరే ఉన్న సందర్భంలో ముగ్గురి విద్యావలంటీర్లను పెట్టుకొని వారికి తానే స్వయంగా జీతాలు చెల్లించారు. పాఠశాల గోడలపై దేశ నాయకుల చిత్రపటాలు, ఇతర బోధనాంశాలకు సంబంధించిన బొమ్మలు గీయించి విద్యార్థులను ఆకట్టుకునేలా చేశారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కల నాటి పచ్చదనాన్ని పెంచి విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించారు. ఏటా పేద విద్యార్థులకు సహాయ సహకారం అందిస్తూ పాఠశాలలో చేర్పిస్తూ ఎన్‌రోల్‌మెంట్ పెంచుతున్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు రాజేందర్‌రెడ్డి. ఇటీవల ఈయనకు పీఎస్ హెచ్‌ఎంగా పదోన్నతి రాగా బదిలీలో తిరిగి ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా వచ్చారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌రెడ్డి

మూతబడిన పాఠశాలలో గంట మోగించి..

ఆత్మకూరు(ఎం): మండలంలోని పోతిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పి. రామకృష్ణ గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రయత్నం చేస్తున్నాడు. విద్యార్థులు లేక రెండేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాల మూతపడింది. గ్రామం నుంచి సుమారు 30మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. దీంతో ఉపాధ్యాయుడు పి. రామకృష్ణ ప్రభుత్వ పాఠశాలల్లో సర్కారు కల్పిస్తున్న వసతుల గురించి అవగాహన కలిస్తూ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల దృష్టిని పాఠశాల వైపు మరల్చాడు. దీంతో మూతపడిన పాఠశాల తెరుచుకుంది. ప్రస్తుతం పాఠశాలలో 10 మంది విద్యార్థులకు వరకు ఉన్నారు. పాఠశాల తెరుచుకునేలా చేసిన ఉపాధ్యాయుడి కృషిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



విద్యార్థుల తల్లికి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ

కలిసికట్టుగా 'సెంచరీ'

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో గతంలో 500కు పైగానే విద్యార్థులు ఉండేవారు. రానురాను విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడంతో ఆ సంఖ్య తగ్గుతూ వచ్చింది. తిరుమలగిరి మండలం నందాపురం గ్రామానికి చెందిన దామర శ్రీనివాస్ ఇదే పాఠశాలలో చదువుకొని ఇక్కడికే ప్రధానోపాధ్యాయుడిగా బదిలీపై వచ్చాడు. తాను చదువుకున్న పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావలన్న సంకల్పంతో తోటి ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎలా పెంచాలని రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు, సామాజికవేత్తలు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించడానికి 20 మంది ఉపాధ్యాయులు ఐదు బృందాలుగా ఏర్పడి వేసవి సెలవుల్లో మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పక్కనే ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కొన్ని గ్రామాలకు కూడా వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పిస్తే కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన అందిస్తామని, పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భరోసా కల్పించారు. దీంతో ఈ విద్యా సంవత్సరం 100 మంది విద్యార్థులు పాఠశాలలో అడ్మిషన్లు పొందారు. ఇంకా అడ్మిషన్లు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పాఠశాలలో 365 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



తిరుమలగిరి స్కూల్‌లో 100వ అడ్మిషన్ ఇస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

రూ.3వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం



మహా జనసభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: ప్రస్తుతం రూ.2300 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకును రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్లడమే లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన డీసీసీబీ మహా జనసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకును గతంలో కంటే అభివృద్ధి మార్గంలో నడిపించడానికి పాలకవర్గ సభ్యులతో పాటు ఉద్యోగులు కూడా సహకారం అందించాలని కోరారు. రాజకీయాలు, ప్రాంతాలకతీతంగా అందరి సలహాలు, సూచనలు తీసుకుని బ్యాంకును లాభాల బాటలో నడిపించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకు రూ.22.13 కోట్ల లాభాలతో నడుస్తుందని వివరించారు. రుణాల మంజూరులో రైతులను ఇబ్బందులకు గురిచేయొవద్దని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. రైతులకు రూ.3లక్షల వరకు పంట రుణాలు అందిస్తామని, ఎల్‌టీ రుణాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సహకార సంఘాల బలోపేతానికి డీసీసీబీ సహకరిస్తుందని అన్నారు. సబ్సిడీ పథకాలపై రైతులలో అవగాహన కల్పించడానికి త్వరలో డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని, దానికి సహకార సంఘాల చైర్మన్‌లు సహకరిచాలని కోరారు. ఈ నెల 24వ తేదీన అన్ని బ్రాంచ్‌ల మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేశామని అందులో సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం చూపుతామని తెలిపారు. అనంతరం ఆయనను సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, సీఈఓ రావులపాటి శంకర్‌రావు, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, జయరాం, కోటి సుష్మ, అందెల లింగంయాదవ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, అప్పిరెడ్డి, రంగాచారి, ఇరిగినేని అందజయ్య, కొండ సైదయ్య, శ్రీనివాస్, వీరస్వామి, అనురాధ, కరుణ, రామచంద్రయ్య, డీసీఓ కిరణ్‌కుమార్, నాగిళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాడుతాం

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య



మాట్లాడుతున్న మేడి పాపయ్య

యాదగిరిగుట్ట: ఎస్సీ వర్గీకరణ సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని, అది సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సంఘం రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మాదిగ, మాదిగ ఉపకులాల న్యాయమైన డిమాండ్ ఏబీసీడీ వర్గీకరణే అన్నారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ గత 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. 10 సంవత్సరాల క్రితం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారానికి వస్తే వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసి చట్టబద్ధ కల్పిస్తామని మాట ఇచ్చి మోసం చేసిందన్నారు. వర్గీకరణ లేకపోవడం వలన మాదిగలు విద్య, ఉద్యోగ అవకాశాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ సాధనకై వచ్చే నెల 9న హలో మాదిగ–చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, మేధావుల ఫోరం నాయకులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ మల్లేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గెలువయ్య, ఏదాసి మోహన్, మంచాల యాదగిరి, బొట్ల శంకర్, క్యాసగల్ల రమేష్, బూసి మహేష్, బొట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం

- స్టీరింగ్ రాడ్డు విరిగి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు

వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని దుప్పెల్లి సమీపంలో స్కూల్ బస్సు రోడ్డు కిందకు దూసుకెళ్లగా విద్యార్థులకు తృటిలో ప్రమాదం తప్పింది. మోత్కూరుకు చెందిన ప్రైవేట్ పాఠశాల బస్సు రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం ఆత్మకూర్.ఎం మండలంలోని కూరెళ్ల, రాఘవాపురం గ్రామాలలోని విద్యార్థులను, వలిగొండ మండలంలోని దుప్పెల్లికి చెందిన విద్యార్థులను మొత్తం 20 మందిని ఎక్కించుకొని పాఠశాలకు వస్తుండగా దుప్పెల్లి గ్రామం దాటిన తర్వాత బస్సు స్టీరింగ్ రాడ్డు విరిగి రోడ్డు పక్కకు దూసుకు వెళ్లింది. బస్సులోని విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. బస్సు కొద్దిదూరం వెళ్తే గుంతలో పడి పెద్ద ప్రమాదం జరిగేది. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రమాదం జరిగిన సమాచారం తెలియగానే ఘటనా స్థలానికి వెళ్లి విద్యార్థులను చూసి ఊపిరి పీల్చుకున్నారు.

పద్మ బ్రాహ్మణ పురోహిత రాష్ట్ర అధ్యక్షుడిగా పాండురంగ శాస్త్రి

యాదగిరిగుట్ట: పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రుద్ర పాండురంగశాస్త్రిని ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. న్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి నిత్యాన్నదాన సత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వెల్దండి ఓంకారం పంతులు, గౌరవ సలహాదారుడు ఆడేపు హరీష్ పంతులు, పాశికంటి ధనుంజయ, అఖిల భారత వేద పాఠశాలల విభాగం, సత్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దీకొండ జోగయ్య, ఉపాధ్యక్షుడు చుంచు నాగభూషణం, ప్రధాన కార్యదర్శులు చిక్క దేవదాసు, రచ్చ శ్రీనివాస్, కోశాధికారి బడుగు మల్లేశం, గంజి సూర్యనారాయణ, ఆయా జిల్లాల అధ్యక్షులు తదితరులున్నారు.



రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికలో పాల్గొన్న ఆయా జిల్లాల అధ్యక్షులు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

బీబీనగర్: రోడ్డు ప్రమాదంలో బీబీనగర్ మండలం నీలతండా మాజీ సర్పంచ్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నీలతండా మాజీ సర్పంచ్ నూనవత్ శ్రీనివాస్‌నాయక్(36) గురువారం రాయరావుపేట గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాలకు బైక్‌పై వెళ్లాడు. సంబరాల అనంతరం బీబీనగర్‌కు చేరుకోగానే వర్షం పడడంతో అక్కడే ఆగాడు. రాత్రి 10గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా బ్రహ్మణపల్లి రోడ్డు మార్గంలో భారత్ గ్యాస్ గోడౌన్ సమీపంలో గల మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. శ్రీనివాస్ బైక్ పైనుంచి ఎగిరి రోడ్డు పక్కన పడడంతో తలకు, ముఖంపై తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి సమయంలో ఎవరూ మృతదేహాన్ని గమనించకపోవడం, శ్రీనివాస్‌కు తన భార్య పద్మ ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో ఈ విషయం రాత్రి వెలుగులోకి రాలేదు. శుక్రవారం తెల్లవారుజామున స్థానికులు అటువైపు వాకింగ్‌కు వెళ్లగా మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా ఘటనా స్థలంలో ఏదో పెద్ద వాహనం బ్రేక్ వేసి రోడ్డుపై అటుఇటు తిరిగినట్లుగా టైర్ల అచ్చులను గుర్తించారు.

ఏకగ్రీవంగా ఎన్నికై..

మృతుడు శ్రీనివాస్ ఉన్నత చదవులు చదవడంతో తండావాసులు అంతా కలిసి నీలతండాకు తనను ఏకగ్రీవ సర్పంచ్‌గా గత ఎన్నికల్లో ఎన్నుకున్నారు. శ్రీనివాస్ బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ తండాను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తూ నిత్యం అందరికీ అందుబాటులో ఉండేవాడని తండావాసులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయ తెలుసుకున్న భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తండాకు చేరుకొని శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

పెద్దఅడిశర్లపల్లి: వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి పుస్తెలతాడు చోరీ చేశారు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురం గ్రామంలో గురువారం జరిగింది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపురం గ్రామానికి చెందిన గనెబోయిన ముత్యాలమ్మ గ్రామ శివారులోని తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా.. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై ఆమె వద్దకు వచ్చి మాటలు కలిపాడు. తాను ట్రాక్టర్ కోసం వచ్చానని, వద్దిపట్ల గ్రామానికి చెందినవాడినని చెప్పి ఫోన్‌లో మాట్లాడుకుంటూ వెళ్లి దగ్గర్లోని షాపు వద్దకు వెళ్లి కూల్‌డ్రింక్ తీసుకొచ్చి ముత్యాలమ్మను తాగమని కోరగా మొదట ఆమె తిరస్కరించింది. ఆ తర్వాత అతడు మాటలు కలిపి తాగమని కోరగా ఆమె కూల్‌డ్రింక్ తాగుతుండగా పక్కనే ఉన్న రాయితో ఆమె తలపై కొట్టి మెడలోని ఉన్న పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. దీంతో ముత్యాలమ్మ ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వాళ్లు వచ్చేసరికి పారిపోయాడు. పుస్తెలతాడు 4 తులాలు ఉంటుందని బాధితురాలు పేర్కొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి పట్టీలు, రూ.75వేలు ఎత్తుకెళ్లిన దొంగలు

నిడమనూరు: మండలంలోని ముకుందాపురంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ గోపాలరావు తెలిపిన వివరాల ప్రకారం.. ముకుందాపురం గ్రామానికి చెందిన షేక్ ఉస్మాన్ తన భార్యతో కలిసి ఈ నెల 14వ తేదీన బంధువుల ఊరైన రుద్రారం వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న వారి కుమారుడు షేక్ సయ్యద్ ఈ నెల 17న అక్కడకు వెళ్లాడు. వీరు శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడం, బీరువా తాళాలు తెరిచి ఉండడం గమనించారు. బీరువాలో దాచిన 12 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి పట్టీలు, రూ.75వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ పరిశీలించారు. షేక్ ఉస్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్యువెల్లరీ షాపులో వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు..

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని స్వర్ణకారుల బజారులో గల ఆదిత్య జ్యువెల్లరీ దుకాణంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపు షెట్టర్‌ను పైకి లేపి 5.50 కిలోల వెండి ఆభరణాలు, 7 తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు అపహరించారు. పెట్రోలింగ్‌కి వచ్చిన పోలీసులు షెట్టర్ పైకిలేపి ఉండడం గమనించి షాపు యజమాని ఆదిత్యకు ఫోన్‌చేసి విషయం తెలియజేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఏడుగురు వ్యక్తులు షెట్టర్ పైకి లేపి బంగారం చోరీ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. షాపు యజమాని ఆదిత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

లంచం ఇవ్వలేదని విద్యుత్ సరఫరా నిలిపివేత

- లైన్‌మెన్‌పై ఏఈకి ఫిర్యాదు చేసిన రైతు

ఆత్మకూర్(ఎస్): లంచం ఇవ్వలేదని తన పొలానికి విద్యుత్ లైన్‌మెన్ కరెంట్ లైన్ కట్ చేశాడని ఆత్మకూర్ (ఎస్) మండలం కందగట్ల గ్రామానికి చెందిన రైతు బొల్లం వీరమల్లు ఆరోపించాడు. కందగట్ల, తిమ్మాపురం గ్రామాల మధ్య గల సోలార్ కంపెనీ సమీపంలో తనకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉందని, ఇటీవల కురిసిన వర్షాలకు తన వ్యవసాయ భూమి వద్ద రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారడంతో సరిచేయాలని గ్రామ లైన్‌మెన్ వెంకటయ్యను కోరినట్లు వీరమల్లు తెలిపాడు. ఈ మేరకు ఈ నెల 14వ తేదీన సిబ్బందితో సహా లైన్‌మెన్ వెంకటయ్య వచ్చి విద్యుత్ స్తంభాలను సరిచేసి రూ.10వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడని బాధిత రైతు ఆరోపించాడు. అంత ఇవ్వలేనని బతిమిలాడడంతో మరుసటి రోజు ఇవ్వాలని గడువు పెట్టాడని, అప్పటికీ ఇవ్వకపోవడంతో ఈ నెల 15వ తేదీన తన పొలానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో శుక్రవారం ఏఈ గౌతమ్‌కు రాతపూర్వకకంగా ఫిర్యాదు చేసినట్లు వీరమల్లు తెలిపాడు. ఈ విషయమై ఆత్మకూర్(ఎస్) మండల ఏఈ గౌతమ్‌ను వివరణ కోరగా.. విచారణ చేసి లైన్‌మెన్‌పై చర్యలు తీసుకుంటానన్నారు. విద్యుత్ సిబ్బందికి ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు ఇవ్వవద్దన్నారు. అవసరమైతే ప్రభుత్వానికి చెల్లించే లావాదేవీలను డీడీల రూపంలో మాత్రమే తీసుకుంటామని వెల్లడించారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్ష

చింతపల్లి: దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ దేవరకొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి. రవీందర్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈ ఏడాది జనవరిలో చింతపల్లి మండలం వెంకటంపేట గ్రామానికి చెందిన కలగోని సత్తయ్య ఇంట్లో గడ్డం విష్ణుమూర్తి అనే వ్యక్తి 17 తులాల వెండి పట్టాగొలుసులు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ యాదయ్య ఆధారాలతో చార్జ్‌షీట్‌ను దేవరకొండ కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోష్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన దేవరకొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి. రవీందర్ నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన ఎస్‌ఐ భీమనమోని యాదయ్య, కోర్టు కానిస్టేబుల్ నగేష్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు



కిరణ్ స్టోన్ క్రషర్ మిల్లును పరిశీలిస్తున్న మాధ్యూ కోషి

మోతె : లోకాయుక్తకు ఎవరైనా తప్పుడు ఫిర్యాదులు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఇన్వెస్టిగేషన్ అధికారి మాధ్యూ కోషి తెలిపారు. నడిగూడెం మండలం చాకిరాలకు చెందిన మాతంగి ఏసుబాబు ఇటీవల కోదాడ నియోజకవర్గంలోని నాలుగు క్రషర్ మిల్లులపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం మోతె మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల కిరణ్ స్టోన్ క్రషర్ మిల్లును లోకాయుక్త మైనింగ్, పొల్యూషన్, పర్యావరణ, తహసీల్దార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మిల్లుకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నిరకాల అనుమతులతో క్రషర్ మిల్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. తప్పుడు ఫిర్యాదులు చేసి సమయాన్ని వృథా చేయవద్దన్నారు. కార్యక్రమంలో జియాలజిస్టు పి.విజయరామరాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బి.శంకర్‌బాబు, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ పి.లావణ్య, తహసీల్దార్ సంఘమిత్ర, డీటీ సూరయ్య, ఆర్‌ఐ అజయ్, నిర్వాహకులు వంగాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకరిపై ఒకరు దాడి.. కేసు నమోదు

గుండాల: ఒకరిపై ఒకరు దాడి చేసుకుని గాయపర్చుకున్న ఘటనలో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన గుండాల మండలం వస్తాకొండూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వస్తాకొండూర్ గ్రామానికి చెందిన సూరారపు ఎల్లమ్మకు చెందిన డప్పును బుధవారం పీర్ల పండుగ రోజు చెట్టుపల్లి చంద్రయ్య పగులగొట్టాడు. శుక్రవారం ఉదయం ఇరువురు డప్పు కోసం గొడవ పడుతుండగా ఎల్లమ్మ మరిది కొడుకైన సూరారం సురేష్ అలియాస్ సుధాకర్ వచ్చి మా పెద్దమ్మతో గొడవ ఎందుకు పెట్టుకుంటున్నావని చంద్రయ్యను అడిగాడు. దీంతో ఆవేశానికి గురైన చంద్రయ్య ఇంట్లో ఉన్న గొడ్డలితో సుధాకర్‌పై దాడి చేశాడు. అక్కడే నిలబడిన మహిళ చేతిలోని కర్ర తీసుకుని చంద్రయ్యపై సూరారపు సుధాకర్ దాడి చేశాడు. ఇరువురు పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని చికిత్స నిమిత్తం ఇద్దరిని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ జి. సైదులు తెలిపారు.

మిర్యాలగూడ సబ్ జైలు సూపరింటెండెంట్ బదిలీ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ సబ్ జైలు సూపరింటెండెంట్ కె. లక్ష్మణ్‌బాబు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని చర్లపల్లి కేంద్ర కారాగారంలో విధులు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

చిట్యాల: పట్టణంలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రంగా గాయాలయ్యాయి. చిట్యాల పట్టణానికి చెందిన సంగిశెట్టి సుగుణమ్మ స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని దాడుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆమె ఎగిరి రోడ్డుమీద పడగా ఆ పక్కనుంచే వెళ్తున్న లారీ ఆమెను మరోమారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె చేయి విరిగిపోగా తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

నారసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయలంలో పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మహానివేదన గావించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు పాల్గొన్నారు.